క్లుప్తంగా

నేడు న్యూ రామాలయంలో చండీ హోమం

నల్లకుంట: మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని న్యూ నల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో జ్ఞాన సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు ఉంటాయని ఆలయ కార్యనిర్వహణ అధికారి కె. జయంతి ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో చండీ హోమం, పూర్ణాహుతి ఉంటుందని పూజ, హోమంలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ గుమస్తా లేదా అర్చక స్వామిని సంప్రదించాలని కోరారు. భక్తులు విధిగా కోవిడ్ నిబంధనలను పాటించాలన్నారు.

రేపటి నుంచి శోభానాయుడు జయంత్యుత్సవ్

చిక్కడపల్లి: నృత్య గురువు శోభానాయుడు జయంత్యుత్సవ్ కార్యక్రమాన్ని త్యాగరాయగానసభలో ఈనెల 13, 14న నిర్వహిస్తున్నట్లు శిష్య బృందం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు ముఖ్య అతిథిగా నాట్యగురువు పద్మజారెడ్డి పాల్గొని మృదంగ కళాకారుడు పీఆర్‌సీ శర్మను సత్కరిస్తారన్నారు. నాట్యశాఖ ఆచార్యులు జొన్నలగడ్డ అనురాధ పాల్గొని ప్రముఖ గాయకుడు అమలాపురం కన్నారావును సత్కరిస్తారని సమాచారం.

బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడికి స్వాగతం



జమాల్ సిద్ధికీని సన్మానిస్తున్న దృశ్యం

నల్లకుంట: కర్ణాటక బీదర్ జిల్లాలో పర్యటనలో భాగంగా బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్ధికి హైదరాబాద్‌కు వచ్చారు. మంగళవారం మైనార్టీ మోర్చా అధ్యక్షుడు అఫ్సర్ పాష, ఇన్‌చార్జ్ షబానా మోమిన్, ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ముజీబ్, మీర్ యాకుబ్అలీ, మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఎం.ఐజాక్‌రాజ్ తదితరులు జమాల్ సిద్ధికీని కలిసి సన్మానించి స్వాగతం పలికారు. తెలంగాణ మైనార్టీ మోర్చా నాయకులు మహమ్మద్ సర్వర్, నిక్కత్ ఫాతిమా, పాలసీ అండ్ రీసెర్చ్ కన్వీనర్ తోసిఫ్ అబ్బాస్ తదితరులున్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన మాజీ వామపక్ష నేత



అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం దక్కేలా తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని మంత్రి కేటీఆర్ తెలిపినట్లు సీనియర్ వామపక్ష నాయకుడు పులిజాల గెల్వయ్య అన్నారు. ఆయన ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి మంగళవారం మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వామపక్ష పోరాట పటిమ అనుభవాలను వినియోగిస్తూ.. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని మంత్రి తెలిపారని వివరించారు. బీఆర్‌ఎస్ నాయకులు దిలీప్‌కుమార్ తదితరులున్నారు.

వ్యక్తి అదృశ్యం



జ్ఞానేశ్వర్ (ఫైల్)

అంబర్‌పేట: టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు అదృశ్యమైన ఘటన అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక అన్నపూర్ణనగర్‌లో జ్ఞానేశ్వర్ (30), సక్కుబాయి దంపతులు నివసిస్తున్నారు. ఈనెల 9న టిఫిన్ సెంటర్ సరుకుల కోసం ఇంటి నుంచి బయటకు వెళ్లిన భర్త తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం పోలీసులకు భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు మహిళలకు జైలు

అడ్డగుట్ట: బస్తీలో జరిగిన గొడవలో ఓ మహిళకు అబార్షన్ అవ్వడానికి కారణమైన ముగ్గురు మహిళలకు మూడ్రోజుల సోషల్ సర్వీస్‌తో పాటు రూ. 20 వేల జరిమానా విధించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్లప్ప వివరాల ప్రకారం.. ఈ నెల 4న మధ్యాహ్నం శిరీష అంబేద్కర్ నగర్‌లోని తన పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో పాత గొడవలు మనస్సులో పెట్టుకొని అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు మహిళలు సంగీత, గాయత్రి, అన్నపూర్ణ శిరీష అన్న సంతోష్‌తో గొడవ పెట్టుకున్నారు. గొడవను అడ్డుకునేందుకు వెళ్లిన శిరీషను ఆ ముగ్గురు మహిళలు తోసేశారు. కొన్ని రోజుల తర్వాత శిరీషకు అబార్షన్ కావడంతో ముగ్గురు మహిళలపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం 15వ మెజిస్ట్రేట్ సదరు ముగ్గురు మహిళలకు మూడ్రోజుల సోషల్ వర్క్‌తో పాటు రూ. 20 వేల నష్టపరిహారం బాధితురాలికి ఇవ్వాలని తీర్పునిచ్చారు.

పేదల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే

అంబర్‌పేట్/ముషీరాబాద్ జోన్ పరిధిలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. వివిధ పార్టీల నేతలు ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు చిరస్మరణీయమని ప్రజల హృదయాల్లో ఆయన ఎప్పటికీ నిలిచి ఉంటారన్నారు. పలుచోట్ల పేదలకు పండ్లను పంపిణీ చేసి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేశారు. అట్టడుగు, నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పోరాటం చేసిన యోధుడు, పేదల ఆశాజ్యోతి పూలే అని పలువురు వక్తలు, ప్రజాప్రతినిధులు కొనియాడారు.

– అంబర్‌పేట్/ ముషీరాబాద్ జోన్ బృందం



గాంధీనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



బాగ్‌లింగంపల్లిలో నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్



నగర కేంద్రగ్రంథాలయంలో..



రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు రాజేశ్వర్‌యాదవ్



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ తదితరులు



అడిక్‌మెట్ డివిజన్ కార్పొరేటర్ సునీతాప్రకాష్‌గౌడ్ తదితరులు



రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి తదితరులు



పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ వీహెచ్, కాంగ్రెస్ నేతలు



రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్



ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తదితరులు



గోల్నాక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్

'పేదలకు కార్పొరేటర్ వైద్యం అందాలి'



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేదలు, మారుమూల ప్రాంతాల ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో ఒక్క రూపాయికే డాక్టర్ కన్సల్టెన్సీ ఇస్తున్నామని పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాకేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. సంపాదించిన దానిలో కొంతభాగం సమాజానికి ఉపయోగపడాలనే లక్ష్యంతో విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. దీనిలో భాగంగా కార్పొరేట్ వైద్య సంస్థలతో మమేకమవుతున్నామని వివరించారు.

- ఇప్పటికే 50 ఆసుపత్రులతో మాట్లాడామని తనను స్ఫూర్తిగా తీసుకుని ఇతర ప్రాంతాల్లో కూడా ఇలాంటి వైద్యశాలలను ప్రారంభించే అవకాశం ఉందన్నారు.
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ.. పేదలకు అందుబాటులో ఉండేలా కార్పొరేట్ వైద్యాన్ని అతి తక్కువ ధరలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఇలాంటి వారికి తమ సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ సుచరితరెడ్డి, సామాజికవేత్త గంగాధర్‌గుప్తా, సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఎంఎస్ శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, యువజన నాయకుడు ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్ తదితరులున్నారు.

స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఐకేపీఓఏ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థలో వివిధ గ్రామస్థాయిలో 17,606 మంది వీఓఏలు పనిచేస్తున్నారన్నారు. 19 ఏళ్ల నుంచి గ్రామాల్లో మహిళల అభ్యున్నతికి మహిళల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తూ.. వారిని ఆర్థిక, సామాజికంగా ఎదిగేందుకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. అలాంటి వారిని ప్రభుత్వం కార్మికులుగా గుర్తించి కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. చిరువ్యాపారాలు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తూ.. వారికి రుణాలు ఇప్పించి తిరిగి సక్రమంగా చెల్లించేలా కృషి చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళా సంఘాలు నిర్వహిస్తున్న లావాదేవీలన్నీ పుస్తక నిర్వహణ చేస్తున్నారని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీవీఓఏ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్.రమా, అధ్యక్షులు రాజ్‌కుమార్, కార్యదర్శి నగేష్, శ్రీకాంత్, సుధాకర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎర్రజెండా పోరాటం

అడ్డగుట్ట: ఇంజినీరింగ్ కార్మికుల జీవితాల్లో వెలుగు నింపేందుకు ఎర్రజెండా నిరంతరం పోరాట ఫలితంగా రూ. 4,200 గ్రేడ్ పే ఇచ్చేందుకు రైల్వే బోర్డ్ అధికారులు అంగీకరించినట్లు మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైల్వేలో అహర్నిశలు శ్రమిస్తూ కనీస వేతనాలు అందక ఇబ్బంది పడుతున్న ఇంజినీరింగ్ కార్మికులకు ఎర్రజెండా మరోమారు అండగా నిలిచిందన్నారు. దాని ఫలితంగానే ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రూ. 4,200 గ్రేడ్‌పే లెవెల్ 6 గరిష్ట వేతనానికి ఎట్టకేలకు న్యూ ఢిల్లీలో జరిగిన రైల్వే బోర్డ్ ఏఐఆర్‌ఎఫ్–పీఎన్‌ఎం సమావేశంలో అధికారులు అంగీకారం తెలిపారు. భారతీయ రైల్వేలో అత్యధిక సంఖ్యలో ఉండి, పట్టాల రక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న ట్రాక్‌మెన్‌లు ఇదివరకు లెవెల్ 5 వరకు మాత్రమే ప్రమోషన్లు, గ్రూప్–సీ ఉద్యోగులకు లెవెల్ 8 వరకు మాత్రమే ఉండేవని తెలిపారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ చేస్తున్న పోరాటానికి ఎట్టకేలకు ఫలితం దక్కిందన్నారు.

ఆకట్టుకున్న కృష్ణవేణి సుస్వరాలు



చిక్కడపల్లి: శ్రీకృష్ణ ఆర్ట్స్, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన కృష్ణవేణి సుస్వరాల కార్యక్రమం ఆకట్టుకుంది. 27వ సినీ సంగీత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన విభావరిలో 30 మంది గాయకులు 7 భాషల్లో 145 పాటలతో 13 గంటలపాటు నిర్విరామ సినీగీతాల కార్యక్రమం నిర్వహించారు. గాయని కృష్ణవేణి, శ్రీనివాస్‌రావుతో పాటు పలువురు గాయనీగాయకులను ఈ సందర్భంగా అభినందించారు. వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆయా రికార్డ్ సంస్థల ప్రతినిధులు బింగి నరేందర్‌గౌడ్, సుభాషిణిలు, ఆల్ రౌండర్ గాయనీ కృష్ణవేణికి అందజేశారు.

సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలి



రిందావెంకటస్‌ను సన్మానిస్తున్న సినీనటుడు రఘుబాబు

చిక్కడపల్లి: మన సంస్కృతి సంప్రదాయలను భవిష్యత్ తరాలకు అందించాలని సినీనటుడు రఘుబాబు అన్నారు. త్యాగరాయగానసభలో సాలంభంజిక స్టూడియో ఆర్ట్స్ అండ్ పర్ఫార్మెన్స్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ.. సాలంభజిక సంస్థ ఎందరో కళాకారులను తీర్చిదిద్ది ప్రోత్సహిస్తోందన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు భామా కలాపం, రామపట్టాభిషేకం, కావడి చిందు, పూజారిణి తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం వెంకట్ సతీమణి రిందావెంకట్, నాట్యాచార్యులు శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ప్రముఖులు పాలపర్తి సంధ్యారాణి, సూర్యనాథ్, రాజు, దాసరి, డాక్టర్ పట్టాలి ధన్యామీనన్, దీప పట్టాలి, రమా, వాణి సుందరి తదితరులున్నారు.

'కార్పొరేటర్ భర్తపై దాడి సరికాదు'



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి



బీఆర్‌ఎస్ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు కొమ్ము శ్రీనివాస్

అంబర్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీలో భౌతిక దాడులకు చోటు లేదని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గోల్నాక కార్పొరేటర్ భర్త దూసరి శ్రీనివాస్‌గౌడ్‌పై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దాడి చేయడం సరికాదన్నారు. ఛే నంబరు చౌరస్తాలోని తన నివాసంలో కార్పొరేటర్ దూసరి లావణ్య, భర్త శ్రీనివాస్‌గౌడ్‌లను పిలిపించుకుని జరిగిన ఘటనపై ఆరా తీశారు. మాజీ కార్పొరేటర్ పద్మావతిరెడ్డి, పులి జగన్, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. సొంత పార్టీకి చెందిన కార్పొరేటర్‌ను వేధించడం ఎమ్మెల్యే అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఆత్మీయ సమ్మేళనానికి సీనియర్లను పట్టించుకోకుండా నియంతృత్వంగా వ్యవహరిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జరుగుతున్న పరిణామాలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీనియర్ నాయకులు కృష్ణగౌడ్, నాగేష్‌గౌడ్, జనార్దన్, రాహుల్ తదితరులున్నారు.

ఎమ్మెల్యేపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదు..

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ కార్పొరేటర్ భర్త దూసరి శ్రీనివాస్ గౌడ్ ఒంటెత్తు పోకడలతో పార్టీకి డివిజన్‌లో తీవ్ర నష్టం జరుగుతుందని ఆ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఆకె.బాబు, భూపతి లక్ష్మణ్‌లు తెలిపారు. మంగళవారం గోల్నాక డివిజన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కార్పొరేటర్‌కు గోల్నాక డివిజన్ అభివృద్ధిపై అవగాహన లేదన్నారు. కేవలం రాజకీయలకే పరిమితమైన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌పై దుష్ప్రచారం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. పూలే జయంతి కార్యక్రమంలో జరిగిన ఘటన దూసరి శ్రీనివాస్‌గౌడ్ కావాలని చేశారన్నారు. తాము అక్కడే ఉన్నామని ఎమ్మెల్యే కావాలని చేయి చేసుకోలేదని వారు వివరించారు. నాయకులు పల్లివి, సుమతి, గీతా, రాము తదితరులున్నారు.

కచ్చా నాలా సమస్యల పరిష్కారానికి కృషి



వీడీసీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు

ముషీరాబాద్: కచ్చానాలా సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్ డివిజన్‌లోని ఫ్రెండ్స్ కాలనీలో రూ.34 లక్షలతో కచ్చా నాలా నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 ఏళ్లుగా ఫ్రెండ్స్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న కచ్చానాలా పనులను వెంటనే చేపడుతున్నామన్నారు.

- వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అవసరమైన చోట మ్యాన్‌హోళ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.
- రాజకీయాలకు అతీతంగా ముషీరాబాద్‌ను అభివృద్ధి చేసేందుకు బాధ్యతతో పని చేస్తున్నామని కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ అన్నారు. ఫ్రెండ్స్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముషీరాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నర్సింగ్‌ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు సోమన్, డివిజన్ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, బీజేపీ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బద్రినారాయణ, కంచికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో..

- రాంనగర్ డివిజన్‌లోని అరినగర్ చౌరస్తా నుంచి ప్లే గ్రౌండ్ వరకు రూ.40 లక్షలతో నిర్మించ తలపెట్టిన వీడీసీసీ రోడ్డు పనులను రూ.4 లక్షలతో అంబేద్కర్‌నగర్‌లో తలపెట్టిన సీసీ రోడ్డు పనులను ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్థానిక కార్పొరేటర్ కె.రవిచారితో కలిసి ప్రారంభించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

'అంతర్జాతీయ నదీ తీరాలలో మా నడక' శైలి ఆసక్తికరం

చిక్కడపల్లి: 'అంతర్జాతీయ నదీతీరాలలో మా నడక సంపుటి'లో నర్మదారెడ్డి భాషశైలి ఆసక్తికరంగా ఆద్యంతం చదివిస్తుందని ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అభినందించారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.రమణాచారి మాట్లాడుతూ.. నర్మద తన సహచారుడు ఇంద్రారెడ్డితో కలిసి 150 దేశాల్లో పర్యటించి వారి అనుభవాలను ఆకట్టుకునే విధంగా రాశారని పేర్కొన్నారు. ప్రపంచంలోని ఏడు నదీ తీరాల విశేషాలు తెలుగు వారికి పరిచయం చేసిన నర్మద జాతికి గొప్పసేవ చేశారని డాక్టర్ వాడ్రేవు చిన వీరభద్రుడు అన్నారు. జర్నలిస్ట్ జయసూర్య సంపుటిని విశ్లేషించారు. సభలో నర్మద తన సంపుటిని భర్తకు లాంఛనంగా అంకితమిచ్చారు. సంఖ్యాశాస్త్ర వేత్త దైవజ్ఞశర్మ, రఘుశ్రీ తదితరులు పాల్గొని ఉగాది పురస్కారాలను ప్రముఖులకు బహూకరించారు.

కేంద్ర హిందీ సలహా కమిటీ సభ్యుడిగా సుశీల్‌కుమార్



కవాడిగూడ: దేశ వ్యాప్తంగా హిందీ భాషను వృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం భోలక్‌పూర్ పద్మశాలి కాలనీకి చెందిన ప్రముఖ విద్యావేత్త సుశీల్‌కుమార్ శర్మకు కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హిందీ సలహా కమిటీకి నాన్ అఫిషియల్ సభ్యుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీ లక్ష్మణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రాష్ట్ర కార్యాలయంలో సన్మానించారు. రాష్ట్రంలో హిందీభాష వికాసానికి కృషి చేస్తానని తనకు అవకాశం కల్పించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌రావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'బలగం'లో ప్రజల జీవితాలను చూపారు



పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న కృష్ణమోహన్‌రావు

చిక్కడపల్లి: తెలంగాణ గ్రామీణ ప్రజల జీవితాలను ఉన్నది ఉన్నట్లుగా బలగం సినిమాలో చూపారని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. త్యాగరాయగానసభలో సాంస్కృతిక సంఘ సేవా సంస్థ కళానిలయం ఆధ్వర్యంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బలగం సినిమాలో నటించిన విజయలక్ష్మి, సురభి లలితలకు పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ప్రముఖులు మురళీధర్, బద్రినాథ్, దాసరి రమ్య, వసంతరాయలు, సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.